సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం, 28, మే, 2024



అభయారణ్యం కళకళ

పాల్వంచ మండలంలోని కిన్నెరసాని అభయారణ్యంలో వన్యప్రాణుల సంఖ్య నానాటికీ పెరుగుతుండగా కళకళలాడుతోంది. 8లో



.. దంపతులు మృతి

ఎమ్మెల్సీ ఓటు వేసేందుకు వస్తూ టేకులపల్లి మండలం సంపత్‌నగర్‌కు చెందిన దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 40° / 30°

జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. గంటగంటకూ ఎండ ప్రభావం పెరుగుతుంది. రాత్రి కూడా వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పీవీకే-5 షాఫ్ట్‌లో సిద్ధమైన మ్యాన్ రైడింగ్



గనిలో మ్యాన్ రైడింగ్ ట్రయల్ రన్ దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో గల పీవీకే–5 ఇంక్లైన్ గనిలో రూ.9.2 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన మ్యాన్ రైడింగ్ సిద్ధమైంది. గనిలో కార్మికులు సుమారు రెండు కి.మీ. మేర నడిచి వెళ్లాల్సి వస్తుండడంతో మ్యాన్‌రైడింగ్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీని ఏర్పాటు బాధ్యతలను విజయవాడకు చెందిన ఓ కంపెనీకి అప్పగించగా ఇటీవల పూర్తయ్యాయి. కొత్తగూడెం ఏరియాలోని ఏకైక భూగర్భ గనిని కాపాడుకుంటూ, కార్మికులపై భారం తగ్గించాలనే భావనతో యాజమాన్యం మ్యాన్ రైడింగ్ పనులు చేపట్టింది. ఈమేరకు సోమవారం ట్రయల్ రన్ నిర్వహించామని, ఎన్నికల కోడ్ పూర్తయ్యాక ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభిస్తామని గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ తెలిపారు.

గెస్ట్ టీచర్లు, లెక్చరర్లకు దరఖాస్తులు ఆహ్వానం

ఏన్కూరు: ఉమ్మడి జిల్లాలోని బూర్గంపాడు, ఏన్కూరు, వైరా రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ టీచర్లు, లెక్చరర్లను నియమించనున్నారు. ఐదో తరగతి నుండి ఇంటర్ వరకు విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏన్కూరు కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. బోధన అనుభవం, మెరిట్ ఆధారంగా అభ్యర్థులకు జూన్ 1న తేదీన ఏన్కూరు గురుకులంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సింగరేణి జీఎం(పర్సనల్ – వెల్ఫేర్ అండ్ సెక్యూరిటీ) బి.ఆర్.దీక్షితులు పిలుపునిచ్చారు. సింగరేణీయుల పిల్లలతో పాటు ప్రభావిత ప్రాంతాల విద్యార్థుల కోసం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నెల రోజులుగా నిర్వహించిన వేసవి క్రీడా శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తరగతి గదుల్లో నాలుగు గోడల మధ్య కూర్చుని చదువుకునే విద్యార్థులకు బయటి వాతావరణం అలవడేందుకే ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఉషు/కరాటే, డ్రాయింగ్ తదితర విభాగాల్లో నిష్ణాతులచే శిక్షణ ఇప్పించామని వివరించారు. నెల రోజుల క్యాంప్‌లో నేర్చుకున్న నైపుణ్యం ద్వారా వివిధ పోటీల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఉపకరిస్తాయని అన్నారు. కార్యక్రమంలో పర్సనల్ ఏజీఎం కోడూరు శ్రీనివాస్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల రమణమూర్తి, పీతాంబరం, విజయభాస్కర్ రెడ్డి, కిరణ్‌కుమార్, టి.శ్రీనివాసరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

నెమ్మదిగా.. జోరందుకుని..





పాల్వంచ డీఏవీ పాఠశాల కేంద్రంలో క్యూలో నిల్చున్న పట్టభద్రులు



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ



టేకులపల్లిలోని ఓ పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు

ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్

- 10 గంటల తర్వాత బారులుదీరిన గ్రాడ్యుయేట్లు
- పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు, నేతలు
- కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- ఖమ్మంలో 67.63 శాతం.. భద్రాద్రిలో 70.01 శాతంగా నమోదు

సాక్షి ప్రతినిధి,ఖమ్మం/సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఉప ఎన్నిక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి కొన్ని చోట్ల ఉదయం 8 గంటల నుంచే పట్టభద్రులు బారులుదీరినా.. ఎక్కువ కేంద్రాల్లో మాత్రం పది గంటల తర్వాతే వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగనుండగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీ.పీ.గౌతమ్, ప్రియాంక ఆల సహా ఏఆర్‌ఓలు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఖమ్మం జిల్లాలో 67.63 శాతం, భద్రాద్రి జిల్లాలో 70.01 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 74.36 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి భద్రాద్రి జిల్లాతో పోలిస్తే తక్కువగా నమోదవడం గమనార్హం.

అధికారుల పరిశీలన

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి వెబ్‌కాస్టింగ్ లైవ్ ద్వారా కలెక్టర్ గౌతమ్ పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అలాగే ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఇల్లెందులోని కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంకా ఏఆర్‌ఓలు సైతం పలు కేంద్రాలను తనిఖీ చేసి ఉద్యోగులకు సూచనలు చేశారు.

పటిష్ట బందోబస్తు

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీఐలు, ఎస్సైలు సహా సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. ముదిగొండలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరగగా పోలీసులు అదుపు చేశారు. భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలోని పోలింగ్ బూత్‌ను ఎస్పీ రోహిత్ రాజ్ పరిశీలించారు.

ఓటు వేసిన నేతలు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, అధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 332 పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ గౌతమ్ దంపతులు ఓటు వేశారు. ఖమ్మంలోని ఇందిరానగర్ బూత్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వైరాలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, సత్తుపల్లిలో ఎమ్మెల్యే పట్నా రాగమయి – దయానంద్, టీజీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, కూసుమంచిలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఓటు వేశారు. ఇక కొత్తగూడెంలోని బాబూక్యాంప్ పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, దమ్మపేటలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కరకగూడెంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఉత్సాహంగా ఓటేసి...

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొందరు మహిళలు చిన్నారులతో సహా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పలు కేంద్రాల వద్ద నాయకులు తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరడం కనిపించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కల్లూరులోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. అలాగే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.



ఓటర్ల వివరాలిలా..

	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
మొత్తం ఓటర్లు	83,879	40,106
ఓటు వేసిన పురుషులు	34,847	16,206
మహిళలు	21,881	11,871
ఇతరులు	02	00
మొత్తం	56,730	28,077

పోలింగ్ సరళి ఇలా...

సమయం	పోలింగ్ శాతం ఖమ్మం	పోలింగ్ శాతం భద్రాద్రి
ఉదయం 10 గంటల వరకు	13.01	7.74
మధ్యాహ్నం 12 గంటల వరకు	30.06	25.79
2 గంటల వరకు	49	46.60
సాయంత్రం 4గంటల వరకు	65.54	68.05
మొత్తం	67.63	70.01

కలెక్టర్ హర్షం



టేకులపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ప్రక్రియ సజావుగా ముగియడం పట్ల కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల హర్షం వ్యక్తం చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన రిసెప్షన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాలెట్ బాక్సులను పటిష్ట బందోబస్తుతో ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు తరలించామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా కృషి చేసిన అధికారులు, జిల్లా ప్రజలు, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటింగ్ సరళిని పరిశీలించిన వద్దిరాజు



పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీ రవిచంద్ర

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ తీరును రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కొత్తగూడెంలో సోమవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో పర్యటిస్తూ ఓటింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు, కాపు కృష్ణ, మోరె భాస్కర్, కౌన్సిలర్ రుక్మాంధర్ బండారి, చల్లా శకుంతల, చల్లా భాస్కర్, మాజీ కౌన్సిలర్ మామిడి శ్రీనివాస్, జగడం కిరణ్ ఉన్నారు.

పోలింగ్ ఏజెంట్‌గా 'పొదెం'



పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్న పొదెం

దుమ్ముగూడెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. దుమ్ముగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య ఏజెంట్‌గా కూర్చున్నారు. ఈ మేరకు ఓటు వేసేందుకు వచ్చిన వారు ఆయనను ఆసక్తిగా పరిశీలించారు.

హోటళ్లలో ఆహార భద్రత అధికారుల తనిఖీ



హోటల్‌లో తనిఖీ చేస్తున్న జోతిర్మయి తదితరులు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలోని పలు హోటళ్లలో ఆహార భద్రత స్పెషల్ డ్రైవ్ అధికారి జ్యోతిర్మయి ఇతర అధికారులతో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లోని ఓ హోటల్‌లో నిల్వ ఉంచిన 88 లీటర్ల ఐస్‌క్రీమ్‌లో ఫంగస్, పురుగులతో దుర్వాసన రావడంతో సీజ్ చేసి, హోటల్ యాజమాన్యానికి రూ.10 వేలు జరిమానా విధించారు. బస్టాండ్ కాంప్లెక్స్‌లో మరో హోటల్‌లో తనిఖీ చేయగా, వంటచేసే ప్రదేశం అపరిశుభ్రంగా ఉండడం, హానికరమైన రంగులను ఆహార పదార్థాల్లో వినియోగిస్తున్నట్లు గుర్తించి ధ్వంసం చేశారు. హోటల్ నిర్వాహకులకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసి, గ్రామ పంచాయతీ అధికారులచే రూ.25వేలు జరిమానా విధించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న మరో హోటల్‌లో ఇడ్లీ పిండిలో ఈగలు చనిపోయి ఉండటం, వంకాయ టమాటా కూరలో బిల్డింగ్ పైకప్పు నుంచి బూజు, మట్టి ఇతర పదార్థాలు రాలిపడి ఉండడం, రసాయనాలు పెట్టే ప్రదేశంలో పల్లీలు, ఇతర చట్నీలు పెట్టడాన్ని గమనించారు. హోటల్ లైసెన్స్ పత్రాలను కూడా డిస్‌ప్లే చేయకుండా ఉండడంతో రూ.5 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రజలకు అమ్మే ఆహారం రుచిగా, శుభ్రంగా, సురక్షితంగా ఉండాలని, లాభార్జన కోసం కల్తీ ఆహారాన్ని అమ్మి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే క్రిమినల్ కేసులు పెడతామని, కేసు తీవ్రతను బట్టి జైలుకు పంపించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో భద్రాద్రి, యాదాద్రి, వనపర్తి జిల్లాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఆర్.కిరణ్‌కుమార్, స్వాతి, నీలిమ, భద్రాచలం గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ కృష్ణార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ ఆదాయానికి గండి !



అనధికారికంగా నిర్వహిస్తున్న దుకాణాలు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. దేవస్థానానికి వచ్చే భక్తులకు కొబ్బరికాయలు విక్రయించేందుకు ప్రతి ఏడాది టెండర్ల ద్వారా వేలం నిర్వహించి ఖరారు చేస్తారు. గతేడాదికి సంబంధించిన రెండు దుకాణాలకు ఈనెల 22వ తేదీతో గడువు ముగిసింది. సాధారణంగా గడువు తేదీకి ముందుగానే ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది టెండర్ల నిర్వహణ లేక ఆ రెండు షాపులు మూతబడ్డాయి. దీంతో కొందరు చిరు వ్యాపారులు పడమర మెట్ల వైపు అనధికారికంగా కొబ్బరికాయలు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున టెండర్లు నిర్వహించలేదని ఆలయ అధికారులు చెబుతున్నారు. గతంలో ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు పాత టెండర్‌దారులకే కొంతకాలం పొడిగించేవారు. కానీ ప్రస్తుతం అటు పొడిగింపు లేక, ఇటు టెండర్ నిర్వహణ లేక ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. జూన్ 1న హనుమాన్ జయంతితో పాటు ప్రస్తుతం వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో భక్తుల రాక పెరుగుతుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు సత్వర నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈసారీ తప్పని వరద భయం

- గోదావరిపై సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణం
- వంద అడుగుల ఎత్తుతో కరకట్టకు ప్రణాళిక
- పర్యావరణ అనుమతుల జారీలో ఆలస్యం
- అర్ధంతరంగా ఆగిన కరకట్ట పనులు



కరకట్ట పనులు లేక ఖాళీగా ఉన్న టిప్పర్లు



చర్ల మండలం పెద్దిపల్లి దగ్గర నిలిచిపోయిన కరకట్ట పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వానాకాలం వస్తోందంటే వరద భయంతో ఏజెన్సీ వణుకుతోంది. ఉగ్ర గోదావరి నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ ఏళ్ల తరబడి ఇక్కడి ప్రజలు వేడుకుంటున్నారు. ఇటీవల సీతారామ రూపంలో వరదల నుంచి పరిష్కారం వచ్చినట్టే వచ్చి మధ్యలో ఆగిపోయింది.

వంద అడుగుల ఎత్తుతో..

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో సీతారామా ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా దుమ్ముగూడెం, అశ్వాపురం మండలాల మధ్య గోదావరి నదిపై సీతమ్మసాగర్ పేరుతో బ్యారేజీ నిర్మించాలని నిర్ణయించారు. ఈ బ్యారేజీకి రక్షణ కల్పించడంతో పాటు వరద పోటును తట్టుకునేలా బ్యారేజీకి ఎగువ భాగంలో నదికి ఇరు వైపులా కరకట్ట నిర్మించాలని నిర్ణయించారు. 2022 జూలైలో వచ్చిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలం కరకట్ట (80 అడుగులు) కంటే ఎత్తుగా వందల అడుగుల ఎత్తుతో ఈ కరకట్టను డిజైన్ చేశారు. నది ఒడ్డున కరకట్టతో పాటు నదుల్లో కలిసే ప్రధాన వాగుల్లోకి నీటి పోటును దృష్టిలో ఉంచుకుని వాగుల్లో సైతం కరకట్టకు ప్రణాళిక రూపొందించారు.

120 కి.మీ. మేర..

గోదావరి తీరం వెంట కరకట్టల నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.3వేల కోట్లు కేటాయించింది. దుమ్ముగూడెం నుంచి మొదలయ్యే ఈ కరకట్ట చర్ల మండలం సుబ్బంపేట వరకు ఉంటుంది. అటు వైపు అశ్వాపురం మండలం అమ్మగారిపల్లె నుంచి పినపాక మండలం దుగినేపల్లి వరకు దాదాపు 120 కి.మీ మేరకు నిర్మించాల్సి ఉంది. ఈ పనులను పలు ప్యాకేజీలుగా విభజించి 2022 చివరన టెండర్లు పిలిచారు. ఆ తర్వాత పనులు దక్కించుకున్న నిర్మాణ సంస్థలు రంగంలోకి దిగాయి. భారీ యంత్రాలు వందలాది మంది కార్మికులు రేయింబవళ్లు కరకట్ట నిర్మాణ పనులు చకచకా చేపట్టారు. దీంతో గోదావరి వరదల నుంచి రక్షణ లభించిందనే భావన ఏజెన్సీ వాసుల్లో నెలకొంది.

ఇంకా ఆలస్యమైతే..

నిర్మాణ పనులు ఆలస్యమైన కొద్దీ సామగ్రి ధరల పెరుగుదల, యంత్రాల అరుగుదల పేరుతో ప్రాజెక్టు అంచనా వ్యయం మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతుంది. మరోవైపు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పంప్ హౌస్‌లు ప్రారంభోత్సవం జరుపుకుని నిరుపయోగంగా పడి ఉన్నాయి.

ఆగిన పనులు..

సీతారామా ప్రాజెక్టులో ప్రధానమైన సీతమ్మసాగర్ బ్యారేజీ, కరకట్ట నిర్మాణ పనులకు పర్యావరణ అనుమతులు తీసుకోలేదని, తమకు సరైన పరిహారం అందివ్వలేదని స్థానికులు కొందరు న్యాయస్థానం, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో 2023 మే చివరి వారంలో సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు ఎక్కడివక్కడే ఆపేయాలంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో బ్యారేజీ నిర్మాణ పనులతో పాటు కరకట్ట పనులు కూడా ఆగిపోయాయి. గత ఏడాది కాలంగా కరకట్ట నిర్మాణ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థల్లో కొన్ని యంత్రాలు, లేబర్ వర్క్‌ఫోర్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించాయి. మరికొన్ని సంస్థలు నదీ తీరంలోనే భారీ యంత్రాలను నిలిపి ఉంచాయి. ఏడాది కాలంగా పనులు లేకపోవడంతో ఆ యంత్రాలన్నీ మరమ్మతులకు గురవుతున్నాయి.

సీతారామ ప్రాజెక్టు ఫలాలు అన్ని విధాలుగా అందాలంటే ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు త్వరితగతిన తీసుకురావడంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

తపాలా శాఖ ఇన్‌చార్జ్ ఏఎస్పీ బదిలీ



సుచేంద్రను సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

భద్రాచలంటౌన్: తపాలా శాఖ భద్రాచలం డివిజన్ ఇన్‌చార్జ్ ఏఎస్పీ సుచేంద్ర వరంగల్ డివిజన్‌లోని నర్సంపేట సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది సోమవారం ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. భద్రాచలం ఇన్‌చార్జ్ ఏఎస్పీగా విధులు నిర్వహించిన సుచేంద్ర రెండేళ్లలో పోస్టల్ సేవలను మారుమూల ఏజెన్సీ గ్రామాలకు విస్తరింపజేశారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో చర్ల, దుమ్ముగూడెం పోస్ట్‌మాస్టర్లు కనకాచారి, ప్రసాదరెడ్డి, సిబ్బంది దుర్గాప్రసాద్, ఆనంద గోపాల్, కోటారెడ్డి, విద్యాసాగర్, గీత తదితరులు పాల్గొన్నారు.

పశువులు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువుల వ్యాన్

భద్రాచలంఅర్బన్: ఏజెన్సీ ప్రాంతమైన దుమ్ముగూడెం మండలం బండారుగూడెం నుంచి భద్రాచలం మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న నాలుగు పశువులను సోమవారం భద్రాచలం బ్రిడ్జి సెంటర్ ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పశువులను పాల్వంచలోని గోశాలకు అప్పగించి, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశారు.

అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి సంచారం



అగంతకుడు సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యం

ఇల్లెందు: పట్టణంలోని కరెంటాఫీస్, జేకే కాలనీ ఏరియా సింగరేణి కార్మికవాడల్లో అర్ధరాత్రి వేళ ఓ అగంతకుడు సంచరిస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జేకే కాలనీ, సుభాష్‌నగర్‌లో ఆదివారం రాత్రి 2.54 గంటల ప్రాంతంలో 20 ఏళ్ల లోపు వయసు ఉన్న వ్యక్తి ముఖానికి మంకీ క్యాప్, మాస్క్ ధరించి ఇళ్లలోకి చొరబడేందుకు ప్రయత్నించాడు. ఓ ఇంటి డోర్ కర్టన్ తొలగించే ప్రయత్నంలో కుటుంబ సభ్యులు గమనించి నిద్ర లేవటంతో పరారయ్యాడు. మరో ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేయగా వారుకూడా మేల్కోవడంతో పలాయనం చిత్తగించాడు. అయితే ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. గతేడాది వేసవి కాలంలో కూడా ఇదే తరహాలో పట్టణంలో చోరీలు జరిగాయి. మళ్లీ సింగరేణి కాలనీలో అగంతకుడు చోరీలకు యత్నిస్తుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని కోరుతున్నారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన సోమవారం జరిగింది. స్థానికులు, బాధితుని కథనం ప్రకారం.. మండలంలోని గోపన్న గూడేనికి చెందిన కబడి గంగరాజు పూరింట్లో తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో మంటలు చేలరేగి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. వేసవి కాలం కావడంతో కుటుంబీకులంతా ఆరుబయటే నిద్రించగా, వారంతా క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బీరువాలో ఉంచిన రూ.1.50 లక్షల నగదు, వ్యవసాయ భూమికి సంబంధించిన హక్కు పత్రాలు, ఇంట్లో ఉన్న సామగ్రి కాలిబూడిదైందని బాధితుడు వాపోయాడు.

కోడిపందేల స్థావరంపై దాడి

పెనుబల్లి: మండలంలోని కర్రాలపాడు గ్రామ శివారు మామిడి తోటలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై వీ.ఎం.బంజర్ పోలీసులు సోమవారం దాడి చేశారు.ఈ సందర్భంగా రెండు కోడి పుంజులు, మూడు బైక్‌లు, రూ.4,500 రూపాయల నగదుతో పాటు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఏడుగురిని అరెస్టు చేసిన వీ.ఎం.బంజర్ ఎస్సై వెంకటేష్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

అభయారణ్యం కళకళ..

● కిన్నెరసానిలో వన్యప్రాణుల సందడి ● ట్రాప్ కెమెరాలకు చిక్కిన పలు జంతువులు

అభయారణ్యంలో స్వేచ్ఛగా విహరించే వన్యప్రాణుల సంతతి క్రమక్రమంగా పెరుగుతోంది. జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలో అటవీ శాఖ అధికారులు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయగా దుప్పులు, అడవి దున్నలు, అడవి పందులతోపాటు పలు రకాల పక్షుల సంతతి పెరిగిందని గుర్తించారు. ఈమేరకు 10 ట్రాప్ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను అధికారులు విడుదల చేశారు. అభయారణ్యంలోని సాసర్‌పిట్ల వద్ద నీరు తాగేందుకు వచ్చిన అడవి దున్నలు, దుప్పులు, పందులు కెమెరాలో నమోదయ్యాయి. కిన్నెరసాని పరిధిలో 22 సోలార్ బోర్లు వేసి 110 సర్క్యులేషన్ ట్యాంకులు, 42 చెక్ డ్యాంలు నిర్మించడమే కాక 35 ఎకరాల్లో గడ్డి పెంచుతున్నారు. కాగా, ఈ ఏడాది మరో 90 ఎకరాల్లో గడ్డి పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎఫ్‌డీఓ బాబూరావు తెలిపారు. – పాల్వంచరూరల్



ట్రాప్ కెమెరాలో నమోదైన అడవి పందులు



అడవి దున్నలు



జింకలు



చిన్న దున్నలు

ఆధునిక భారతదేశ రూపశిల్పి నెహ్రూ



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఆధునిక భారతదేశ రూపశిల్పి జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటం నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అహర్నిశలు పాటుపడిన నెహ్రూ తొలి ప్రధానిగా దేశాభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, మలీదు వెంకటేశ్వరరావు, నాగండ్ల దీపక్‌చౌదరి, కామా అశోక్, ముడుముంతల గంగరాజు యాదవ్, బాణాల లక్ష్మణ్, సంపటం నర్సింహారావు, గజ్జి సూర్యనారాయణ, మహమూద్, వాసిం, జానీ, రజీ, వేణు, జానీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటింగ్..

శాసనమండలి నల్లగొండ– వరంగల్– ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికలు సోమవారం నిర్వహించారు. జిల్లాలోని పట్టభద్రులు, పలువురు ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. –సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్ : ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కుటుంబీకులు..



ఖమ్మం మయూరిసెంటర్ : వేలి చుక్క చూపిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ



వైరా : ఓటు హక్కు వినియోగించుకున్న ఖమ్మం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



కుటుంబ సభ్యులతో టీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



సత్తుపల్లిటౌన్ : కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ కె.సుజాత



దమ్మపేటలో ఓటు వేసిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



కొత్తగూడెంలో ఓటేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు



కరకగూడెంలో ఓటేసేందుకు లైన్లో నిల్చున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

చిరస్మరణీయుడు రాయల శేషగిరిరావు

సంతాప సభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, నేతలు



శేషగిరిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు, తదితరులు

తల్లాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పరితపించిన రాయల శేషగిరిరావు చిరస్మరణీయుడిగా నిలిచిపోతారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వెల్లడించారు. తల్లాడ మండలం మిట్టపల్లిలో సోమవారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సమావేశంలో , బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతోపాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రాయల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి మాట్లాడుతూ 40ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో అలుపెరగకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన శేషగిరిరావు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఐదు దఫాలుగా గంగదేవిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేసి రైతు బాంధవుడిగా గుర్తింపు పొందారన్నారు. అలాగే, ఎంపీపీగానూ అనేక అభివృద్ధి చేశారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వర్‌రావు, సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వర్‌రావు, పోటు ప్రసాద్, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు భాగం హేమవంతరావు, కేతినేని హరీశ్‌చంద్ర, కట్టా అజయ్‌కుమార్, దిరిశాల ప్రమీల, దొడ్డా శ్రీనివాసరావు, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, అయిలూరి ప్రదీప్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, మువ్వా మురళి, కేతినేని చలపతిరావు, డి.దాసురావు, ఎస్. కోటారెడ్డి పాల్గొన్నారు.

నగదు కోసం ఓటర్ల నిరీక్షణ !

పలు ప్రాంతాల్లో డబ్బుల పంపిణీ

కామేపల్లి/కొణిజర్ల: పట్టభద్రుల ఓటర్లు ఓటు వేసేందుకు వచ్చినా కొన్నిచోట్ల పార్టీల నాయకుల కోసం వేచి ఉన్నారు. కామేపల్లిలో ఓ పార్టీ నాయకులు ఓటర్లకు పోలింగ్ కేంద్రం సమీపాన రూ.300 చొప్పున పంపిణీ చేశారు. దీంతో ఓటర్లు పలువురు తొలుత నాయకుల వద్దకు వెళ్లి ఓటరు స్లిప్ చూపించి డబ్బు తీసుకున్నాకే పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. దీంతో సదరు పోలింగ్ కేంద్రానికి ఆలస్యంగా ఓటర్లు వచ్చారు. అయితే, ఓటర్లకు రూ.300 చొప్పున ఇవ్వగా అందరికీ సరిపోకపోవడంతో నాయకులు చేతులెత్తేసి అక్కడ నుంచి జారుకున్నారు. దీంతో కొందరు నేరుగా వెళ్లి ఓటు వేసినా.. ఇంకొందరు మాత్రం ఓటు వేయకుండానే వెనుతిరగడం కనిపించింది. మరో పార్టీ నాయకులు ఒక రోజు ముందుగానే ఓటర్లకు రూ.500 చొప్పున అందించారు. ఇక కొణిజర్ల మండల కేంద్రంలోనూ పట్టభద్రులకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు బహిరంగంగానే డబ్బులు పంపిణీ చేయడం కనిపించింది. కాంగ్రెస్ నాయకులు రూ.250 చొప్పున, బీఆర్‌ఎస్ నాయకులు రూ.500 చొప్పున అందజేశారు. దీంతో చాలా మంది పట్టభద్రులు సదరు పార్టీల కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు.

టెండర్ ఓటు

వైరా: వైరాలోని 394 పోలింగ్ కేంద్రంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సంపసాల మోహన్‌కాంత్ ఓటు వేయడానికి వచ్చేలోగా ఆయన ఓటు అప్పటికే వేసినట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. దీంతో ఆయన రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అధికారులు టెండర్ ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈక్రమాన కాసేపు కేంద్రంలో గలాటా జరగగా.. ఏసీపీ రహమాన్, సీఐ సాగర్ చేరుకుని శాంతింపజేశారు.

చిన్నారులను లాలించిన పోలీసులు !

ఖమ్మంమయూరిసెంటర్/కరకగూడెం: ఖమ్మం – వరంగల్ – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా పట్టభద్రులైన పలువురు మహిళలు చిన్నారులతో సహా పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. అయితే, చిన్నారులను లోపలికి తీసుకెళ్తే ఇబ్బంది ఎదురవుతుందనే ఉద్దేశంతో వారిని అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు లాలించడం కనిపించింది. ఖమ్మంలోని ఎస్ఎస్‌పీ స్కూల్‌లో ఓటు వేసేందుకు వివాహిత నుంచి పోలీసు కానిస్టేబుల్ తీసుకుని ఆమె ఓటు వేసి వచ్చేంత వరకు లాలించి ఆ తర్వాత తల్లికి అప్పగించాడు. అలాగే, పినపాక పోలింగ్ కేంద్రంలో ఓటేయడానికి వచ్చిన ఓ మహిళ బిడ్డను సైతం హెడ్ కానిస్టేబుల్ కాసేపు ఎత్తుకుని ఆ తర్వాత అప్పగించగా పలువురు అభినందించారు.



ఖమ్మంలో తల్లి ఓటు వేసేందుకు వెళ్లగా చిన్నారిని ఎత్తుకున్న కానిస్టేబుల్



పినపాకలో ఓటేయడానికి వెళ్లిన మహిళ బిడ్డను లాలిస్తున్న హెడ్ కానిస్టేబుల్

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్యాయత్నం

చింతకాని: మండలంలోని చిన్నమండవకు చెందిన వివాహిత భర్త, అత్త వేధింపులు తట్టుకోలేక గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమండవకు అనూష, అదే గ్రామానికి చెందిన గోపీ ప్రేమించుకుని కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించగా.. గోపి కొంతకాలంగా మద్యం సేవిస్తూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అలాగే, అత్త వెంకట్రావమ్మ కూడా అనూషను వేధిస్తోంది. ఈ నేపథ్యాన కొన్నాళ్ల నుంచి పుట్టింట్లో ఉంటున్న అనూష మనస్తాపంతో ఆదివారం అర్ధరాత్రి గొంతు కోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో గమనించిన కుటుంబీకులు ఆమెను 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగులమీరా తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు వేసేందుకు వస్తూ దంపతులు మృతి



పాయం కృష్ణ (ఫైల్)



జానకి (ఫైల్)

టేకులపల్లి: ఎమ్మెల్సీ ఓటు వేసేందుకు వస్తూ దంపతులు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని సంపత్ నగర్ గ్రామానికి చెందిన పాయం కృష్ణ(42) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుంటాడు. ఇదే మండలంలోని రావులపాడుకు చెందిన జానకి (38)తో వివాహం కాగా, వారికి ఎనిమిదో తరగతి చదువుతున్న షణ్ముఖప్రియ అనే కూతురు ఉంది. వారు ప్రస్తుతం పాల్వంచలో నివాసం ఉంటున్నారు. జానకి గ్రాడ్యుయేట్ కావడంతో ఓటు వేసేందుకు బైక్‌పై టేకులపల్లికి వస్తుండగా లాలుతండా సమీపంలో కోరుట్ల నుంచి భద్రాచలం వెళ్తున్న కారు అతివేగంగా వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ప్రైవేట్ వాహనంలో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతిచెందారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి నివాళులర్పించారు.

ఓటర్లకు బహిరంగంగా పంపకాలు

పోలింగ్ కేంద్రాల వద్ద నేతల హడావుడి

పాల్వంచ: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఆయా పార్టీల నేతలు బహిరంగంగా నోట్ల పంపకాలకు తెరలేపారు. పాల్వంచలోని పలు పోలింగ్ కేంద్రాలకు కూతవేటు దూరంలో పార్టీల నాయకులు, ప్రత్యేకంగా వచ్చిన వ్యక్తులు ఓటింగ్ స్లిప్‌లు చూపించి వారికి రూ. 300 నుంచి రూ.500 వరకు పంపిణీ చేశారు. మూడు ప్రధాన పార్టీల నాయకులు నగదు పంపిణీ చేపట్టడం గమనార్హం. పార్టీ పెద్దల నుంచి వచ్చిన నగదులో సగానికి పైగా నొక్కేశబూరంటూ పలువురు పోలింగ్ కేంద్రాల వద్దే నాయకులతో వాగ్వాదానికి దిగారు. ఇటీవల కాలంలో కొందరు నాయకులు పార్టీలు మారింది డబ్బుల కోసమేననే చర్చ సాగింది. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఉండి ఓటు అభ్యర్థించాల్సి ఉండగా, పలుమార్లు ఆయా కేంద్రాల గదుల వద్దకు రాకపోకలు సాగిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీసింది. డీఏవీ పాఠశాల వద్ద నాయకులను కట్టడి చేయలేదని పలువురు పేర్కొన్నారు. ఓ కేటీపీఎస్ ఉద్యోగి మద్యం తాగి సెల్‌ఫోన్‌తో కేంద్రంలోకి వెళ్లి ఫొటో తీయడంతో వాగ్వాదం నెలకొంది. దీంతో పోలీసులు అతడిని బయటకు పంపించారు.

లారీకింద పడి యువకుడి మృతి

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వద్ద సోమవారం లారీ కింద పడి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అశ్వాపురం మండలం పాములపల్లి గ్రామానికి చెందిన కుంజా రాజశేఖర్(25) బైక్‌పై పాల్వంచ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో రాజశేఖర్ రోడ్డుపై పడిపోగా, అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ అతనిపై నుంచి దూసుకెళ్లింది. దీంతో రాజశేఖర్ శరీరం మొత్తం ఛిద్రమై అక్కడికక్కడే మృతి మృతి చెందాడు. ఆ ప్రాంతం భీతావహంగా మారింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

బూర్గంపాడు: ఈ నెల 22న మణుగూరు క్రాస్‌రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సారపాక గాంధీనగర్‌కు చెందిన రాసమళ్ల సాగర్(40), అతని భార్య మంగమ్మతో కలిసి మోటార్‌సైకిల్‌పై ఈ నెల 22న మొండికుంట గ్రామానికి కూలి పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మణుగూరు క్రాస్‌రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో మోటార్‌సైకిల్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో సాగర్‌కు, మంగమ్మకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఇద్దరిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాగర్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ నేతల వాగ్వాదం

ముదిగొండ: మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం సమీపాన సోమవారం కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బీజేపీ జిల్లా నాయకుడు ఒకరు కారులో వస్తుండగా.. అడ్డగించిన కాంగ్రెస్ నాయకుడు కారుపై బీజేపీ గుర్తు ఉందని అభ్యంతరం తెలిపారు. ఈక్రమంలో అసభ్య పదజాలంతో మాట్లాడగా గొడవ మొదలైంది. రెండు పార్టీల నాయకుల మధ్య తోపులాట జరగగా. పెద్ద ఎత్తున జనం గుమిగూడారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను పంపించివేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

గాయపడ్డ బాలుడి మృతి



హర్షవర్ధన్(ఫైల్)

బూర్గంపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లో తరలిస్తుంగా ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చర్ల మండలం దోసనపల్లి గ్రామానికి చెందిన కణితి హర్షవర్ధన్ (14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాల్వంచ పట్టణంలోని గుడిపాడులోని మేనమామ సోయం హరికృష్ణ ఇంటికి వెళ్లాడు. ఆదివారం అదే గ్రామానికి చెందిన బంధువుతో శెట్టిపల్లి నర్సింహారావుతో కలిసి బూర్గంపాడు మండలం కృష్ణసాగర్‌లో కర్మకాండలకు బైక్‌పై బయల్దేరగా, పినపాక పట్టీనగర్‌లో సమీపంలో కిన్నెరసాని బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో నర్సింహారావు అక్కడికక్కడే మృతి చెందగా, హర్షవర్ధన్ చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పోలీసులు రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బూర్గంపాడు సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు నర్సింహారావు తండ్రి నాగేశ్వరరావు పదేళ్ల క్రితమే రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, బాబాయి రాంబాబు సంరక్షణలో పెరుగుతూ ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. చుట్టపు చూపుగా వెళ్లి రోడ్డు ప్రమాదంలో తనువు చాలించిన కుమారుడు హర్షవర్ధన్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు ఆనందరావు, కృష్ణవేణి గుండెలావిసేలా రోదిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు..



లాలయ్య (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీకి చెందిన జార లాలయ్య (55) మర్రిగూడెం జీపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. పక్షం రోజుల క్రితం చింతూరు వెళ్లిన లాలయ్య అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

పాల్వంచరూరల్: కిడ్నీ, లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతూ సోమవారం ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మాళోతు రాము(51) కొంతకాలంగా కిడ్నీ, లివర్ వ్యాధులతో బాధపడుతున్నాడు. చికిత్స పొందినా నయంకాకపోవడంతో మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

కొత్తగూడెంటౌన్: లారీ ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ద్విచక్ర వాహనదారుడు పోస్టాఫీస్ సెంటర్ మీదుగా కొత్తగూడెం సూపర్‌బజార్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో ఓ లారీ టేకులపల్లి నుంచి కొత్తగూడెం మీదుగా రుద్రంపూర్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో బైక్‌ను లారీ ఢీకొనడంతో యువకుడు కిందపడిపోయాడు. లారీ ముందు చక్రాలు అతని ఎడమకాలుపై నుంచి వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా యువకుడి కుటుంబ సభ్యుల నుంచి తమకు ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.



గాయపడ్డ యువకుడికి కట్లు కడుతున్న స్థానికులు